క్లుప్తంగా

ఘనంగా ముత్తంశెట్టి పుట్టినరోజు



కేక్ కట్ చేస్తున్న 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

సింహాచలం: మాజీ మంత్రి, భీమిలి మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలను బుధవారం సాయంత్రం 98వవార్డు అడవివరంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల అప్పలరాజు, కర్రి సత్తిబాబు, బోర కృష్ణారెడ్డి, మజ్జి ధర్మా, ఆకుల నాగరాజు, తెడ్లపు మహేష్, గుడ్ల గురునాథ రెడ్డి, జగదీష్, పాలూరి సూరిబాబు, లండ భాస్కర్, దమ్ము ఎర్రాజీరావు, రచ్చ వర్మ, మజ్జి అప్పలరమణ, బోర మోహన్‌రెడ్డి, సిరిపురపు సత్తిబాబు, సిరిపురపు నరసింగరావు,సంపెంగ శ్రీనివాసరావు, ఆనంద్ పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ

మహారాణిపేట : ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు కచ్చితంగా పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ అన్నారు. బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు-2016పై మాధవధారలో గల కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. నిబంధనలు పాటించకపోతే భారీ జరిమానా కట్టవలసి ఉంటుందన్నారు. తడి-చెత్త పొడి, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎస్‌ఆర్‌కే రావు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అదనపు ఎగ్జికూటివ్ ఇంజినీర్ ఎ.శ్రీరామ చంద్రమూర్తి, పోర్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీవీఎన్‌టీ మూర్తి, జీవీఎంసీ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, జిందాల్ కంపెనీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి.సతీష్, అదనపు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీలక్ష్మి, వీధి వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమే



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట : ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాల వికాస్ ఫౌండేషన్, స్వంతన సేవా సమితి సంయుక్తంగా ముద్రించిన 'బాలల హక్కులు.. చట్టాలు' పుస్తకావిష్కరణ సభ బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో జరిగింది. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమే అన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థను సమస్యగా కాకుండా సవాలుగా చూడాలన్నారు. విద్యా హక్కు చట్టాన్ని నిజాయితీగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులకు అవగాహన లోపం వల్ల విద్యార్థులు బాలకార్మికులుగా మారుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ సెంటర్ కార్యదర్శి డాక్టర్ సత్యమూర్తి, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

ఉక్కు కార్మికుల జీతాలు చెల్లించాలి

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాలు ఈ నెలలో అయినా సకాలంలో చెల్లించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విశాఖ ఉక్కు పోరాట కమిటీ నాయకులు ఎస్.రామారావు కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద దీక్షా శిబిరంలో బుధవారం ఆయన మాట్లాడారు. యాజమాన్యం ఇచ్చిన మాటను ఈ సారైనా నిలబెట్టుకోవాలన్నారు.

టీకాలతో జీవాలకు రక్ష

- సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం
- వ్యాక్సిన్‌తోనే పశువులు, జీవాలు సేఫ్
- వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు

జిల్లాలో పశువుల వివరాలు	
ఆవులు	41,549
గేదెలు	25,806
మేకలు	32,477
గొర్రెలు	46,720



దాకమర్రిలో పశువులకు వ్యాక్సిన్లు వేస్తున్న వైద్యాధికారి శ్రీనివాస్ (ఫైల్)



వ్యాక్సిన్ల గురించి రైతులకు అవగాహన కలిగిస్తున్న దాకమర్రి పశు వైద్యాధికారి కాంతికిరణ్



గొర్రెలకు వ్యాక్సిన్లు వేస్తున్న పశు వైద్యాధికారి దినేష్‌కుమార్

తగరపువలస: నైరుతి రుతుపవనాలు వచ్చేశాయి. వాన చినుకులు చల్లగా పలకరిస్తున్నాయి. అక్కడక్కడ భారీ వర్షాలు కూడా కురుస్తున్నాయి. ఈ సమయంలో పశువులు, గొర్రెలు, మేకలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కొత్తగా మొలకెత్తిన గడ్డిని తినడంతో పశువులు, ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి వ్యాపించే ప్రమాదం ఉంది. ఈ రోగాల నివారణకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఉచితంగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు.

నల్లజాతి పశువుల్లో గొంతువాపు వ్యాధి

నల్లజాతి పశువులైన గేదెలలో ప్రస్తుత సీజన్‌లో అధికంగా గొంతువాపు వ్యాధి వ్యాపిస్తుంటుంది. గొంతు కింది భాగం వాపుతోపాటు ఊపిరితిత్తులలో నిమ్ము చేరుతుంది. తద్వారా పశువులకు ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. ఆయాసం, గురకతోపాటు తీవ్రమైన జ్వరంతో ఆహారం తీసుకోలేక మృత్యువాత పడే ప్రమాదం ఉంది. ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే రక్తపరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి నిర్ధారించి చికిత్స అందించాల్సి ఉంటుంది. ఈ గొంతు వాపు వ్యాధి నివారణకు తప్పనిసరిగా పాడిరైతులు వ్యాక్సిన్లు వేయించాలి.

తెల్లజాతి పశువుల్లో జబ్బవాపు వ్యాధి

తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులు, లేగదూడలకు జబ్బవాపు వ్యాధి వ్యాపిస్తుంది. పశువులకు జబ్బ, వెన్ను, తొడ తదితర కండ గల శరీర భాగాల్లో నల్లటి వాపు వస్తుంది. దీంతో పశువులకు జ్వరం రావడం, మేత మేయకపోవడం, కదలలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలున్న పశువులకు వెంటనే చికిత్స చేయించాలి. సకాలంలో చికిత్స చేయించకపోతే పశువులు మరణించే ప్రమాదం ఉంటుంది. ఈ జబ్బవాపు వ్యాధి వ్యాపించకుండా ముందుగా పశువులకు వ్యాక్సిన్లు వేయించాలి.

మేకలు, పొట్టేళ్లలో చిటుకు వ్యాధి

తొలకరి వర్షాలకు మొలకెత్తిన లేతగడ్డిని పొట్టేళ్లు, మేకలు తిన్నప్పుడు వాటిలో ఉండే బ్యాక్టీరియా, క్రిములు నేరుగా శరీరంలోకి వెళ్లడం ద్వారా చిటుక వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన జీవాలకు వెంటనే చికిత్స చేయించాలి. లేదంటే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఈ వ్యాధి వ్యాపించకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా వ్యాక్సిన్లు వేయించాలి.

ముమ్మరంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం

జిల్లాలో ఆవులు, గేదెలు, ఎద్దులు, దున్నలు, పొట్టేళ్లు, మేకలకు వ్యాక్సినేషన్ ముమ్మరంగా సాగుతోంది. జబ్బవాపు వ్యాధి రాకుండా ఆవులు, ఎద్దులకు బీక్యూ వ్యాక్సిన్, గొంతువాపు వ్యాధి రాకుండా గేదెలు, దున్నలకు హెచ్ఎస్ వ్యాక్సిన్, చిటుక వ్యాధి నివారణ కోసం పొట్టేళ్లు, మేకలకు ఈటీ వ్యాక్సిన్ వేస్తున్నారు. ఇప్పటికే ఈటీ వాక్సిన్, బీక్యూ వ్యాక్సిన్ దాదాపు పూర్తి కాగా హెచ్ఎస్ వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతోంది.

అందిస్తున్న వ్యాక్సిన్లు

- ఈటీ వ్యాక్సిన్ : గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి రాకుండా
- బీక్యూ వ్యాక్సిన్ : ఆవులు, ఎద్దులకు జబ్బవాపు వ్యాధి రాకుండా
- హెచ్ఎస్ వ్యాక్సిన్ : గేదెలు, దున్నలకు గొంతు వాపు వ్యాధి రాకుండా

వ్యాక్సిన్ వేయిస్తే మంచిది..

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తెల్ల, నల్లజాతి పశువులతోపాటు జీవాలలో అత్యధికంగా వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నాయి. ముందు జాగ్రత్తగా వాటి సంరక్షణకు తప్పకుండా వ్యాక్సిన్లు వేయించాలి. దీని ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చు. పశువులకు ఎవరైనా అత్యవసర చికిత్స అందించాలనుకుంటే 1902 నంబరుకు ఫోన్ చేస్తే సంచార వాహన సిబ్బంది వచ్చి వైద్యసేవలు అందిస్తారు. ఇప్పటికే ఈటీ వ్యాక్సిన్, బీక్యూ వాక్సిన్ పూర్తికాగా హెచ్ఎస్ వ్యాక్సినేషన్ జరుగుతోంది. జూలై నుంచి గొర్రెలకు బ్లూ టంగ్ (నీలి నాలుక) వ్యాక్సిన్ ఇవ్వనున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాక్సిన్లను సద్వినియోగం చేసుకోవాలి.

– జి.కాంతి కిరణ్, పశువైద్యాధికారి, దాకమర్రి, భీమిలి మండలం

అనాథ చిన్నారులకు ఆర్థిక సాయం



చిన్నారులకు ఆర్థిక సాయం అందిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటరావు

సాక్షి ఎఫెక్ట్..

సబ్బవరం: తల్లిదండ్రులు మృతి చెందడంతో అనాథలుగా మిగిలిపోయిన గొల్లల పాలేనికి చెందిన చిన్నారులకు పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు ఆర్థిక సాయం అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. చిన్నారుల తల్లిదండ్రుల పెద్దకర్మను బుధవారం గ్రామస్తులంతా తలా ఓ చేయివేసి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రూ.5 వేలు అందించారు.గొల్లలపాలెంలోని ఎస్సీ కాలనీకి చెందిన చందా నూకరాజు, భార్య కనకమ్మ మృతి చెందారు.దీంతో అనాథలుగా మిగిలిపోయిన వారి కుమారులు పవన్ కుమార్,అర్జున్‌లకు అప్పన్న హస్తం అందించాలని బుధవారం 'సాక్షి'లో వచ్చిన కథనం చదివి చలించిపోయిన యలమంచిలికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పుల్లా వెంకటరావు మాస్టారు ఈ ఆర్థిక సహాయం అందించారు. పిల్లలకు ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలని ఫోన్ నెంబర్ ఇచ్చి భరోసా కల్పించారు.దీంతో ఆయనకు గొల్లలపాలెం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

యువత స్పందించారు.. చెట్టు తొలగించారు



చెట్టు నరికి పక్కకు తొలగించిన దృశ్యం



చెట్టు తొలగించిన బ్యాడ్ బాయ్స్ యూత్ సభ్యులు

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: ఇటీవల కురిసిన వర్షాలకు స్థానిక సినిమాహాలు కూడలి-పరవాడ మధ్య కూలిన చెట్టును పరవాడ బ్యాడ్ బాయ్స్ యూత్ సభ్యులు మంగళవారం రాత్రి తొలగించి మావనవతాదృక్పథం చాటుకున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షానికి మండలంలో అనేక చోట్ల చెట్లు కూలిపోయాయి. పరవాడ రహదారిలో కూడా భారీ వృక్షం కూలిపోవడంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. అధికారులు మాత్రం పట్టించుకోలేదు. ఈ విషయాన్ని 'సాక్షి'లో ప్రచురించడంతో ఎవరో వస్తారు అని ఎదురు చూడకుండా బ్యాడ్ బాయ్స్ యూత్ సభ్యులు రోడ్డుపై కూలిపోయిన చెట్టును నరికి పక్కకు తొలగించారు. దీంతో యూత్ సభ్యులను పలువురు అభినందించారు.

విలక్షణ విమర్శకుడు శ్రీశ్రీ



మాట్లాడుతున్న ఆచార్య వెలమల సిమ్మన్న

సీతంపేట : సహృదయ సాహితీ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా 'విలక్షణ విమర్శకుడు శ్రీశ్రీ 'అనే అంశంపై సాహిత్య సదస్సు నిర్వహించారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ శ్రీశ్రీ అలుపు లేని అన్వేషి అని, వెనుదిరగని సాహసి అన్నారు. జీవనాడి తెలుసుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన సహృదయ సాహితీ సభ్యుడు టీపీఎస్ ఆచార్యులకు ఘన నివాళులు అర్పించారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన దువ్వూరి సరోజిని



సరోజినిని సత్కరిస్తున్న వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం : కైలాసపురంలో గల శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకత్వం చేస్తున్న దువ్వూరి జోగులాంబ, రాజేశ్వర్రావుల కుమార్తె దువ్వూరి సరోజిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటింది. ఇటీవల అయోధ్యలో భారతి మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్, ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఆఫ్ యూపీ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 2024 పోటీలో సత్తా చాటింది. ఆంధ్రప్రదేశ్ తరఫున సరోజిని పాల్గొని స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించింది. 100 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణం, 400 మీటర్ల పరుగు పందెంలో రజతం, 5 కిలోమీటర్ల నడకలో కాంస్యం సాధించింది. తెలుగు రాష్ట్రానికి చెందిన సరోజిని ఈ విధంగా మూడు విభాగాలలో మూడు పతకాలు సాధించడం ఎంతో గర్వంగా ఉందని ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ సెక్రటరీ జనరల్ మంగ వరప్రసాద్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి అమరేంద్రరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

సరోజినికి సత్కారం

విశాఖ చేరుకున్న సరోజినిని బుధవారం వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్వో కమల్ బైద్, యూత్ చైర్‌పర్సన్ వంశీ సత్కరించారు.

మరిడిమాంబ పండగకు వేళాయె

- నేడే ప్రధాన పండగ
- 1965లో కార్మికుల విరాళాలతో ఆలయ నిర్మాణం
- దేశ విదేశాల నుంచి హాజరు కానున్న భక్తులు



సర్వాంగ సుందరంగా ఆలయ ముఖ ద్వారం



ముస్తాబు అయిన ఆలయం (ఇన్‌సెట్) మరిడిమాంబ అమ్మవారి విగ్రహం

సింథియా: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా సింథియా మరిడిమాంబ అమ్మవారికి ప్రతీతి. ఈ ఆలయానికి 80 ఏళ్ల చరిత్ర ఉంది. నాటి నుంచి ఏటా అమ్మవారి ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన వారు సైతం ఈ ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. గురువారం అమ్మవారి ప్రధాన పండగను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆలయ చరిత్ర ఇదీ

దేశంలో మొట్టమొదటి నౌకా నిర్మాణ సంస్థ సింథియా నేవిగేషన్ కంపెనీగా పేరుగాంచిన నేటి హిందూస్థాన్ షిప్‌యార్డ్ సంస్థ ముఖద్వారం ఎదుట అమ్మవారు వెలసిందని పూర్వీకుల విశ్వాసం. ఇప్పటి నేవల్ డాక్‌యార్డ్ అప్రంటీస్ స్కూల్ ప్రహరీని ఆనుకుని అమ్మవారి పుట్టమన్ను స్థలం ఉంది. అప్పట్లో రైలు మార్గం గుండా షిప్‌యార్డ్‌కు వచ్చే ఎగుమతి, దిగుమతులు, ఉత్పత్తులకు మొదట అమ్మవారి మందిరం వద్ద పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నాకే పనులు ప్రారంభించే వారని చెబుతుంటారు. రైలు మార్గం గుండా తరలివచ్చే కూరగాయలు, పలు రకాల ముడి సరుకులు నగరంలోని పాతపోస్టాఫీస్‌కు తరలించేందుకు దుర్గాబీచ్ నుంచి ఫెర్రీ(నీటిపై తేలియాడే తాళ్లతో కట్టిన కర్రల వంతెన) ద్వారా తరలించేవారు. అప్పట్లో సింథియా నేవిగేషన్ కంపెనీలో సుమారు 5వేల మంది కార్మికులు పని చేస్తుండేవారు. 1944లో ఆ ప్రాంతంలో అమ్మవారు తిరిగాడేవారని కార్మికులు అంటున్నారు. 1952లో ఓ రోజు రాత్రి వేళ భయంకరమైన ఉరుములు, మెరుపులతో పాటు పట్టీల శబ్దంతో అమ్మవారు కార్మికులకు కనిపించారని, ఆ తల్లి కోరిక మేరకు ఆ ప్రదేశంలో చిన్నపాటి పూరిపాకను నిర్మించి రాతినే అమ్మవారి ప్రతిరూపంగా నెలకొల్పినట్లు ప్రతీతి. అప్పటి షిప్‌యార్డ్ కార్మిక నాయకులు పిల్లా వీరన్న, శరగడం అప్పలనాయుడు, పిల్లా అప్పారావు, కిల్లాడ అప్పన్న తదితర కాలనీ పెద్దలు గుడి నిర్మాణానికి నాంది పలికారు. దీంతో అప్పటి షిప్‌యార్డ్ సీఎండీ కమోడోర్ లిల్లీ సహకారంతో అమ్మవారి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయ నిర్మాణానికి కార్మికులంతా తమ ఒకరోజు వేతనాన్ని విరాళంగా ఇచ్చారని, 1965లో ఆలయ గోపురం, ముందుపెంకుతో మండపాన్ని నిర్మించారు. కాలనీ వ్యాపారులు గూడేల బాబూరావు, మిల్లు రంగబాబు వంటి వారే దేశ విదేశాల్లో స్థిరపడిన వారి కుటుంబ సభ్యులు అమ్మవారి ఉత్సవాలను ప్రతి ఏటా అంగరంగ వైభవంగా జరిపిస్తుంటారు. షిప్‌యార్డ్‌ను నౌకాదళ రక్షణ రంగంలో విలీనం చేయడంతో ఉద్యోగులు, కాలనీవాసుల సంఖ్య తగ్గిపోవడంతో కొన్నేళ్లుగా అమ్మవారి ఉత్సవాలను కాలనీ పూర్వీకులే నిర్వహిస్తున్నారు. ఆలయానికి ఎటువంటి ఆదాయం లేకపోయినా భక్తులు, కాలనీ పెద్దల సహకారంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.



ఆలయంలో ప్రతిష్ఠించిన మహాశివుని విగ్రహం

ఏర్పాట్లు పూర్తి

సుదీర్ఘ చరిత్ర గల సింథియా మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలు ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమైన అమ్మవారి ఉత్సవాలు నేటితో ముగియనున్నాయి.

5న ఉత్సవ చాటింపుతో ప్రారంభమైన ఉత్సవాల్లో 6న పుట్ట బంగారం తీసుకువచ్చారు. ప్రతి రోజు అమ్మవారికి దూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. 13న గురువారం పండగ ముగింపులో భాగంగా ఆలయంలో అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం జాతర మహోత్సవాన్ని భారీ బాణసంచా నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

వైభవంగా ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



లక్ష పుష్పార్చనకు సిద్ధం చేస్తున్న పువ్వులు

దాబాగార్డెన్స్: అస్సాం గార్డెన్స్‌లో వెలసిన అనఘా లక్ష్మి, వారాహి సహిత రాజశ్యామల అమ్మవార్ల ఆలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం విశ్వశాంతిని కాంక్షిస్తూ సాయిదర్బార్ ప్రాంగణంలో గల అమ్మవార్ల సన్నిధిలో ఆలయ అర్చకులు శైవాగమ రీతిలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, లక్ష పుష్పార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, మహాలక్ష్మి హోమం జరిపారు. మహిళలు, భక్తులు సామూహిక శ్రీలలితా సహస్రనామ పారాయణ చేశారు. అన్నప్రసాద వితరణ చేపట్టారు.